# మహిషావ్యాఖ్యానం



**వాకాటి పాండురంగారావు**

"ఏమిటి మీ ఉద్దేశం... నే నొకదాన్ని వున్నాననుకున్నారా, లేదనుకున్నారా... మీ చిత్తం వచ్చినట్లు ఆవులు దూడలూ కొనేస్తే.... దాని ఆలనాపాలనా ఎవరు చూడాలని.... అయినా హాయిగా వీరయ్య పోసే పాలు తాగి కూచోకుండా ఏం బుద్ధులివి__?" అంటూ డీజిలింజనులా మీదకొచ్చేసిన కమలమ్మను చూచి రామానుజం బిత్తరపోయాడు. ఇట్లా కొరియన్ విమానంమీదకురష్యామిస్సైల్ వచ్చేసినట్లు కమలమ్మ దాడిచేయడం పైకేగిపోవడం పాతికేళ్ళనుండీ 'ఎజెండా'లో వున్న అంశమే కాని, తాజాగా ఈవిడ 'సైరన్' 'ఆన్'చేయ డానికి కారణం ఏమయివుంటుందబ్బా__ అన్న జిజ్ఞాసలో పడిపోయాడు ఆ పతి దేవుడు.

ఆమె చేతిలో దినపత్రిక ఆదివారం అనుబంధం చూచాడు.... కమలమ్మకు బల్లిపతనం, పిల్లిశకునం, హస్త సాముద్రికం వగైరాలమీద మన హేతు వాదాలకున్నంత గాటి నమ్మకం వుంది .... అందుచేత రెండురెళ్ళు నాలుగు__ అన్న విధంగావిషయంపోల్చేసుకున్నాడు. ఎంత కమలమ్మ మొగుడయినా, రామానుజం హేమాహేమీల్లాంటి ఇంజనీర్ల పేగుల్ని, వాళ్ళు ఆవలించకుండానే లెక్క పెట్టగల దక్షుడు కదా....

"ఇదుగో.... కమలం.... ఏం రాశా దేవిటి ఆ వారఫలాల్లో__" అని హిదయతుల్లాలా డైరెక్టుగా పాయింటులో కొచ్చేశాడు.

"....ఈ వారం 'మీకు చరాస్తి యోగం వుంది. పాడిసంపదను కొంటారు.' అని ఘంటాపథంగా రాసి వుందిక్కడ__" అని వాదన ముగించిన ప్రాసిక్యూటర్‌వలె ఆ పత్రిక నతడి ముందు పారవేసింది కమలారామానుజం.

అతడు ఆ పత్రికను ముట్టుకోకుండానే__

"ఇది జరగని పని! నా కసలు ఆవులు, గేదెలు అంటేనే పడదు. అలాటిది నేను పాడిని కొనడమేమిటి?... ఏదో అలా రాస్తుంటారు కాని, అందరికి అది వర్తించదు." అన్నాడు.

"ఎందుకు వర్తించదూ అంట?.... మీది కుంభరాశేనా? శతభిష పాదమేనా.. ఈ రాసినవాడు విషయం తెలిసినవాడేనా? భాష తెలుగేనా? పాడి అంటే ఆవులు, గేదెలేనా? ఇందులో వర్తించనిది ఏది?.. అమ్మమ్మో.... మిమ్మల్ని నమ్మడానికి లేదు. ఓరినాయనో ఇంకెక్కడయినా ఏ బీబినాంచారో వుంది కామోసు.... దానికి పేడా పిడకలూ అంటే ఇష్టం కామోసు .... ఇన్నాళ్ళు నాకు తెలియకుండా కిట్టయ్య వేషం వేశారన్నమాట.... ఇప్పుడేమో ఆ సత్యభామకు పాడి కావలసి వచ్చిందన్నమాట పాడి!__" అని ఉక్రోషము, విమర్శ కలిపి వర్షించిన కమలమ్మను శాంతింపచేయడానికి రామానుజానికి అరగంట పట్టింది. ఆ సాయంకాలం కమలమ్మకు అరుపేటల గొలుసొచ్చింది.

కాని రామానుజం మనసులో లోపల మాత్రం ఏదో తెలియరాని వెలితి లాటిది వుండిపోయింది. తన పాతికేళ్ళ సివిల్ కంట్రాక్టర్ గిరీలో నాలుగయిదుసార్లు ఇలాటి ఫీలింగే రావడం, ఆ వెను వెంటనే ఏదో తిరకాసులో ఇరుక్కోవడం__ జరిగినట్లు ఠీలగా అన్పించింది. ఏదో చేదు రుచికి వెనుకాడినట్లు మనసు అలజడి చెందింది....

ఆ మరురోజుదయం__

రత్నాభవన్ ఎనిమిదో అంతస్తుమీద ఉత్తరపు వరండాలో 816 నెంబర్ గది లోపల కూచునివున్న అప్పారావ్ కాలింగ్ బెల్ నొక్కాడు.


పి.ఏ. వచ్చాడు.... "ఏమిటి ఈ బిల్లు?....ఏమిటటా ఈ బిల్లు పెట్టడం?... దీనితోబాటు ఇన్‌స్పెక్టర్ సర్టిఫికేట్ తగలడవద్దూ .... వాడెవడికీ బుద్ధిలేక పోతే.... నీ బుద్ధి ఏమయింది....ఇలాగ ఇన్‌కంప్లీట్ కేసులు పెట్టెయ్యడం.... నాలాటివాడు ఏమిటిది అని అడిగితే, ఇహ అక్కడనుండి 'ఓహో.... ఆ ఇ.ఇ. అప్పారావు దుర్మార్గుడండీ.... ఇదండీ అదండీ__' అని కారుకూతలు కూయడం!.... రూల్స్ పాటించే నాలాటి వాడికివి రోజులు కాదయ్యా... తీసుకెళ్ళు ఆ బిల్లు! ఓసారి చెక్‌చేయి.... ఆ హరి & హరి.... అండ్‌కో వారినోసారి వచ్చి తగలడమను...." అని ఫైలు విసిరేశాడు.

కర్మాని కన్న కూర్మితో ఫైలునందుకున్న పి.ఏ. పాతకాలంవాడు. ఇ.ఇ. గారి మాటలకిలా అర్థం చెప్పుకున్నాడు.... 'హరి & హరి వాడికెంత ధీమా.... బిల్లిలా పంపించేస్తే పాసయి ఆ లక్షా

పాతికా చెక్ వచ్చేస్తుందనేనా...చూస్తానీ వెధవ పని...."

నవ్వుతున్నాడు పి.ఏ. ఈసారి అయ్యగారి యావ దేనిమీద వుందో....

ఫోన్ చేశాడు.



హరి & హరి, కంట్రాక్టర్స్ ఆఫీసులో యజమాని రామానుజం లేడు, కనుక ఆయన తర్వాత అక్కడ పెద్దదిక్కయిన యాకూబు తీశాడు.

వార్త అందుకున్నాడు.

రాత్రి యాకూబు చెబుతున్నాడు: రామానుజం వింటున్నాడు. విన్నకొద్దీ విస్తుపోతున్నాడు రామానుజం. చెప్పడం పూర్తిచేసి.... "అదండీఆ ఎంగిలి ఎదవ కోరిక" అని ముగించాడు.

బిల్లులో అయిదు పర్సెంటన్నది చేతికి అయిదు వేళ్ళలాటి సహజసత్యం. మూడు నక్షత్రాల హోటల్లో పార్టీ లివ్వడం, తీర్థం పోయించడం, దురద పెట్టినచోట గోక్కోవడం లాంటిది. అడపదడపా అయ్యగారి అత్తగారికి విమానం టిక్కట్లు, పండగలకు ఆపిల్ బుట్టలు, ఎప్పుడయినా, ఓ ఫారిన్ వాచిలాటివి అలవాటే.... సరే ఇరవై రెండేళ్ళ తర్వాత ఒక 'ఋష్యశృంగుడి'లాటి ఎం.ఎ (లేదా ఇ.ఇ.) ఆంగ్లోఇండియన్ కేబరే శాల్తీయో కావాలంటే— ఆ దరిద్రగొట్టు పనీ చేయాల్సి వచ్చింది.... యాభైయేళ్ళు నిండాక ఆ పని చేసినందుకే మనసు కుళ్ళిపోయినట్లయింది. వెధవ కంట్రాక్టర్‌నయి పుట్టానెందుకు, ఇంతకన్న నాలుగిళ్ళు అడుక్కుతినేవాడి బ్రతుకు నీతిగా వుంటుంది కదా అన్పించింది. కాని ఆ కమలం వుందే.... దాని నగల దాహం మండిపోను, కోలార్ గనిలో పాతర వేసినా, తీరదు.... కనకం అయింది; కాంత అయింది. ఇప్పుడింక గేదె అన్నమాట!....

యాకూబు చెప్పిన మాటలు గింగురుమంటున్నాయి....

"ఓయ్ యాకూబూ....మాంఛి గవిడ గేదె.... పూటకు కనీసం లీటర్నర పాలిచ్చేది కావాలోయ్....అలాటి దానిని మా అత్తారింటికి చేర్చాలి. వాళ్ళా గేదె చేరిందని వుత్తరం రాశాక నువ్వొచ్చి కనపడు, బిల్‌మీద సంతకం పెడతా"—నన్నాడండీ....

ఆ నక్షత్రకుడి అత్తారిల్లు ఏదోనాలుగు కిలోమీటర్లవతల ఏ అంజిపాలెమో అనుకుంటే—అట్టే కాదు.... ఆ ఆదిదంపతులు వేంచేసి వున్న పుణ్యస్థలి పెన్నా నదీ తీరాన నెల్లూరు దగ్గర కుగ్రామం— ఆ వూరికే వెళ్ళి ఏ రెండు వేలో తగలేసి తోలిద్దామనుకుంటే అది కాదన్నాడు. 'మా అల్లుడయ్య అయిద్రాబాద్ నుండి అంపించిండు' అని అత్తమామలు ఆ గ్రామస్తులందరితోనూ సగర్వంగా చెప్పుకోవాలి అని శ్రీవా'డి' పురమాయింపు! ఇక్కడంతాసిద్ధంచేసి బయలుదేరేముందు తానోసారి చూచి సాగనంపాలని కూడా ఆయనగాడి చిరుషరతు!

'కమలమా! నా వారఫలాలు రాసేవాడెవడో నిజంగఢిల్లీ దూరదర్శన్ కెళ్లాల్సిన వాడే! 'అనుకుని— లేని హుషారు తెచ్చుకుని యాకూబుతోసహా బయల్దేరాడు రామానుజం— నిత్య లీటర్త్రయక్షీరదాయిని అయిన మహిషీమణి అన్వేషణలో.

* * *

"తోక కనీసంనలభై యంగుళాలన్నా వుండాలన్నారండి...." అంటూ యాకూబు గేదె తోకను పట్టుకుని ఆప్యాయంగా దువ్వుతున్నాడు. 'ఇలా కొలతలు గట్రా

పెట్టి మీ మహిష జాతిని అవమానం పాలు చేస్తున్నందుకు ఏమీ అనుకోకు తల్లీ' అన్నట్లుగా వెర్రి చిరునవ్వు'లాటి దానిని వెళ్లగించుకుని గేదెకేసి చూస్తున్నాడు.

రామానుజమేమో స్ప్రింగ్ టేపు నొక్కాడు.

గేదె నమ్మతలచుకున్న లచ్చువమ్మ 'ఏమిటో ఈ పట్నంబాబుల తీరే ఇట్టాగుండాది-' అనుకుని పాకచూరు నానుకున్నట్లు నిలబడింది.

రామానుజం ఎంత నొక్కినా ఆ టేపు బయటికి రావడంలేదు.... మొదటిసారి మైకుముందు నిల్చున్న వక్త నోటి మాటవలె బిగుసుకుపోయింది.

"అదిలాగివ్వండి.... ఈ తోక ఇలా అందుకుని నైసుగా.... చాల నైసుగా, మనం ఇంజనీర్ పీనుగులతో మాట్లాడినంత నైసుగా దువ్వుతూండండి-" అని యాకూబ్ "గేదె తోకలు దువ్వుట-తొలి మార్గాలు" అన్న 'పాడిపంటలు' విషయాన్ని సంగ్రహంగా వివరించి ఆ తోక నతిభక్తిశ్రద్ధలతో రామానుజానికి అందించాడు. అతగాడు దానిని గవర్నర్ దగ్గర ప్రశంసాపత్రాన్ని అందుకున్నంత గౌరవంతో అందుకుని టేప్‌ని యాకూబుకిచ్చాడు.

"అలా వంకరయితే ఎట్లాగ, కాస్త నిటారుగా పట్టండి—" అన్న యాకూబు హెచ్చరికతో రామానుజం తోకయొక్క కుచ్చు దగ్గర కుడిచేత్తోను, మొదట కొంత ఏహ్యభావంతో జంకినా చివరకు తెగించి తోకయొక్క మూలస్థానం దగ్గర ఎడమచేత్తోను పట్టుకున్నాడు. సాక్షాత్తుగా సర్వహస్తుడా అన్నట్లున్న రామానుజానికి ఎడగా క్రింద కూర్చున్న యాకూబ్ ఆ స్ప్రింగ్‌టేప్ ఇటూ అటూ ఆడించి, కుచ్చు దగ్గర పెట్టి నొక్కాడు. తాక్కున లేచిన లోహపు టేప్- పాములా పైకి లేచి రామానుజం ఎడమచేతిని తాకింది.... ఆ నొప్పి కెట్లాగో ఓర్చుకుని యాకూబ్‌కేసి కారంగా చూశాడు.

"నాకేసి కాస్సార్.... టేప్‌కేసి చూడండి సార్! పొడవెంతో చెప్పండి" అన్నాడు యాకూబు.

ఆ వెధవ టేప్‌మీది అరిగిపోయిన అంకె కంటికి ఆనక కాస్త వంగి జాగ్రత్తగా చూచాడు.

రామానుజం.... "ముప్పైతొమ్మిదీ" అనబోతుండగా ఆవాలము అమూలమూ కదిలింది- ఆ మూలనుండి ఈ మూలకు పేడా మట్టీ రంగరించిన పారాణిలాటి జిగురుపదార్థంతో అద్దిన ఆ తోకను రెండుసార్లు ఝాడించింది గేదె! టేప్ చేతినుండి జారిపోగా, పక్కకు పడిపోయాడు రామానుజం. ఆ ఊపులో ఆయన తన పాదం తొక్కగా "కుయ్యో"మన్నాడు యాకూబు....

"చొచ్చొచ్చొ....ఏటొచ్చింది గేదెకు ....అంతలేసి బాబుల మొహాల కలాపూసియ్యచ్చా—" అంటూ లచ్చువమ్మ ఝాన్సిలక్ష్మిలా రంగంలోకి దిగింది.

"భలేవారే.... ముందా మొహం కడుక్కోండి-" అని యాకూబ్ చెప్పగా పక్కనున్న తొట్టిలోని నీళ్ళను దోసిలి నిండా తీసుకుని మొహంమీద చల్లుకున్న రామానుజానికి ఈ జగమంతా పులిసిన కంపుతో నిండినట్లయింది.

"అయ్యయ్యో.... అదేవిటి బాబూ ఆ కుడితినీళ్ళతో మొహం కడుక్కుంటారేటి?" అన్న లచ్చువమ్మ హెచ్చరిక విని ఆపుకోలేనంత నవ్వొచ్చి కూలబడిపోయాడు యాకూబ్.

అంగవస్త్రంతో మొహం తుడుచుకుని మండిపడే కళ్ళతో చూద్దామనుకుని మినపపొట్టు వడియాలు పెట్టిన ఈతచాపలా వున్న మొహంతో రామానుజం క్రింద కూలబడివున్న యాకూబ్ మొహంకేసి చూడగా అది కనబడలేదు; ఆ స్థానే పిడకలు తట్టిన గోడమీద అప్పుడే జడివాన కురిసినట్లున్న దృశ్యం కనబడింది.

"అఫ్‌ఫ్పః ప్...." ఏదో అనబోయిన యాకుబ్ నోరు తెరవడానికి ఇది అదను కాదని గ్రహించి, నోటి కడ్డంపడుతున్న ద్రవ-ఘన పదార్థాన్ని మూతి నుండి దూరంచేయడంలో నిమగ్నుడయ్యాడు!

అతగాడి దీనావస్థ చూచి స్థాణువులా నిలబడిపోయిన రామానుజం మొహం హఠాత్తుగా ఆకురాయితో గోకుతున్నట్లు మంటపట్టింది.... ఎగిరి గంతేశాడు....

"అయ్యో మిడిమాలమా! కుడితి పొట్టు కోసం అయ్యగారి మొహం నాకుతావంటే! నీ జిమ్మడ-" అని లచ్చువమ్మ గేదె డొక్కలో రెండు తాపులు తన్ని, పలుపూడదీసి దూరంగా లాక్కుపోయింది!

ఆ మరురోజుదయానికి గేదె రామానుజం ఇంట కారుషెడ్డులోను, రామానుజం యాకూబులు ముందు గదిలోను వున్నారు.

"తోక పొడవు పరవాలేదండీ.... అయ్యగారు చెప్పిందానికి అరసెంటీమీటర్ తక్కువ.... అంతే! వంకర కొమ్ము లుండకూడదన్నారు. కాని ఒక కొమ్ము వంకరనిపిస్తూంది...."

"అసలా ముండాకొడుకు బుద్ధే వంకర-" అని చిర్రుబుర్రు లాడాడు దవడలమీద గేదె నాలుక గీచిన ఎర్రటి చారలు చిమచిమ లాడుతుండగా రామానుజం.

"ఇహపోతే పాలు- శుభ్రంగా పొద్దున రెండు లీటర్లు- సాయంత్రం లీటరున్నర ఇస్తుంది."

"ఊ-"

"అంచేత -అయ్యగారు కోరిన లక్షణాలన్నీ వున్నట్లే!"

"ఇంకేవిటి ఆలస్యం?"

"రవాణా అండి! అదే పెద్ద సమస్య అయింది. విడిగా కేవలం ఈ ఒక్క గేదె కోసం ఒక లారీ కావాలండి! ఇక్కడ నుండి లంకెలపాలానికి పదహారు వంద లడుగుతున్నారండి___!"

"ఎంతా? పదహారు వందలా?"

"ఔనండీ! అదికూడా అడ్వాన్సుగా ఇచ్చేయాలండి!"

"గేదె మూడువేలు_ రవాణా చార్జీలు పదహారు వందలు_ మొత్తం నాలుగు వేల ఆరువందలు___"

"ఇంకా వుంది కదండి! గేదెకు, దానికి తోడుగా వెళ్ళేవారికి దారి ఖర్చులు, మేత వగయిరా...."

తల పట్టుకున్నాడు రామానుజం. కాసేపయ్యాక విసుగుతో "ఏదో ఒకటి కానీవోయ్! ఆ యమవాహనాన్ని లారీ ఎక్కించి ఆ చిత్రగుప్తుడి అత్తారింట్లో నూకేసిరా, పో!"

"అదేవిటి? పో! అంటారేవిటి? తమరు రారా?...."

"నేనా? ఆ గేదెతోనా? లారీలోనా?_ ఛస్తే రాను_" అని కరాఖండీగా చెప్పాడు రామానుజం,

"మరి నేను మాత్రం అంత పెద్ద లారీలో, ఒంటరిగా ఆ గేదెతో...." అని సణుగుతున్న యాకూబ్‌తో_ "మన ఆఫీసుబాయ్ నర్సింహాని తీసుకువెళ్ళు_" అన్నాడు రామానుజం.

_ఆ సాయంకాలం అష్టకష్టాలు పడి ఆ గేదెను అద్దె లారీలో కెక్కించారు. గేదెతో బాటు యాకూబు, నర్సింతో బయలుదేరారు. లారీని ఊరిచివర ఆపగా, అక్కడికి ఎం.ఎ. అప్పారావ్ వచ్చి చూశాడు.... తల ఊచాడు.

లారీ కదిలింది.

లారీకి 'టాటా' చెప్పి ఇటు తిరిగిన అప్పారావుకు రామానుజం మొహంమీద చారలుకన్పించాయి."అదేంటి రామానుజం గారూ! 'ఫేయిర్ అండ్ లవ్లీ' వాడుతున్నారా ఏంటీ? సరిగా పూసుకోవాలండీ ఆ క్రీముని.... అప్పుడు మొహమంతా ఎర్రగా అవుతుంది_" అన్న అప్పారావు మాటలు వంద గేదె నాలుకలవలె అనిపించి వణికిపోయాడు రామానుజం.

లారీ సగందూరం దాటడానికి ఎనిమిది గంటలు పట్టింది.

తెల్లవారుఝామున నాలుగ్గంటలవేళ ఒకచోట ఠాక్కున ఆగింది. కునికిపాట్లు పడుతున్న యాకూబుకు_ "ఎవరయ్యా అదీ, దిగండి!" అన్న అధికార రోగ పూరిత స్వరం వినపడింది.

ఉలిక్కిపడి లేచి, లారీ దిగాడు యాకూబు.

"ఏమయ్యా.... ఏకంగా గేదెనే దొంగిలించుకుపోతున్నావా?" అన్నాడా అధికారి. వాడు చెక్‌పోస్టువాడో, భక్షక భటుడో, ఎవడో తెలియని యాకూబు "అదేంటండీ_ మా ఇఇ అప్పారావుగారి గేదండీ.... వారత్తారింటికి తోలుకెళ్తున్నాను...." అన్నాడు కొద్దిగా కోపం, బాధ కలిపిన స్వరంతో.

"ఈ గేదె మీదే_ అనడానికి దాఖలా ఏముందీ?" అని అడిగాడా కొశ్చెన్ దొర. యాకూబు జవాబు చెప్పేలోగా_

"దాని వెయిటెంత?" అడిగాడు. ఇంకా___

"అయినా హైదరాబాదునుండి నెల్లూరికి గేదెను తీసుకుపోవడం ఏందయ్యా? నెల్లూరంత గొడ్డుపోయిందా ఏమిటి? నాకేదో అనుమానంగానే వుంది!" అంటూ యాకూబు సిలబస్‌లో లేని ప్రశ్నలన్నీ చదివేసరికి_ యాకూబుకు అర్థంఅయింది.

"గురువుగారూ! దగ్గర్లో 'టీ' కొట్టయినా వుందా? వెళ్ళి టీ తాగివద్దాం రండి_" అని 'గురు'గారి భుజంమీద చెయ్యేశాడు యాకూబు. ఆ యూనిఫారంలోవున్న 'పడుపుకత్తె' ఇకిలించాడు. ఇద్దరూ నడిచారు.

పావుగంట తర్వాత యాకూబు వచ్చి లారీ ఎక్కాడు.

"తల్లీ! గేదె మాలచ్చీ.... నీ కిలా అడుగడుగున ముడుపులాయె! మా మొహానికేమో పేడకంపాయె_" అని సినీమార్క్ జానపదగేయం ఆలపిస్తుండగా లారీ వేగం పుంజుకుంది.

మరుసటిరోజు శుక్రవారం ఉదయం.

లంకెలపాలెంలో లారీనుండి రాజసంగా దిగిన ఆ గేదెను చూచిన అప్పారావు అత్తమామల ఆనందానికి అవధులు లేవు. ఆ వూరి పోస్ట్‌మాన్ గేదె చేరినట్లు త్తరం రాయగా, దానిమీద మామగారి ఎడమ బొటనవేలి ముద్దర వేయగా, ఆ రాజపత్రాన్ని అందుకుని భద్రంగా భాగ్యనగిరం చేరాడు యాకూబు.

హరి & హరి కంపెనీవారి కంట్రాక్టు పని బిల్లుమీద ఎం.ఎ. గారి సంతకం పడింది.

చెక్ అందుకున్న రామానుజం 'అమ్మయ్య_ మహిషాసుర పురాణం తీరింది_' అనుకుని నిట్టూర్చాడు.

కాని ఆ సాయంకాలమే ఫోనొచ్చింది.

"ఏమయ్యా రామానుజం! మరీ ఇంత ఘటికుడి వయిపోయావేం? నువ్వు ఘనంగా పంపావే ఆ గేదె రెండో రోజున ఉన్నపళంగా చచ్చిపోయిందిట! జబ్బున్న దానిని నా నెత్తిన కట్టి, నన్ను ప్రతిష్ఠపాలు చేద్దామనుకున్నావా_" ఆ తర్వాత మరి వినలేదు రామానుజం.

మరుసటి రోజుదయం ఆస్తిలో సగం కమలమ్మకు, సగం అనాధ శరణాలయానికి రాసిన వీలునామా కనుపించింది. రామానుజం కనుపించలేదు.

అతగాడు హృషీకేశం వెళ్ళి సన్యాసుల్లో కలిసిపోయాడని కొందరు చెప్పుకుంటుంటారు.